ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025
5
అల్లూరి సీతారామరాజు



గోతులు తీశారు.. పూడ్చడం మరిచారు...

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో సెల్ టవర్ల నిర్మాణాలతో పాటు కేబుళ్లను అమర్చేందుకు సొవ్వ రోడ్డు గుండా గోతులను తీసి పూడ్చకుండా రోడ్డుపై మట్టిని వదిలేసారు. కేబుళ్లను అమర్చిన సంబంధించి టవర్ల అధికార యంత్రాంగం గోతులను పూడ్చడంలో నిర్లక్ష్యంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుకిరువైపుల గోతులు ప్రమాదకరంగా మారాయి. కేబుళ్లను అమర్చిన రోడ్డు పక్కనే మట్టిని వదిలేయడంతో వర్షాలతో చిత్తడిగా మారుతుంది. ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై మట్టి ఉండడంతో జారిపడి జారి పోతున్నాయి. అధికారులు స్పందించి గోతులను పూడ్చి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని గిరిజనులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

హామీల అమలేదీ ?

- జిఒ నెంబర్ 3 పునరుద్ధరణపై కానరాని చర్యలు
- ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించకుండా అన్యాయం
- 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ బహిరంగ వ్యాఖ్యలు
- కూటమి ఏడాది పాలనపై ఆదివాసీల్లో అసంతృప్తి


అరకులోయ సభలో అభివాదం చేస్తున్న చంద్రబాబు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పాడేరు: ఆదివాసీల అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తామని ఎన్నికల ముందు బోలెడు హామీలను గుప్పించిన కూటమి పార్టీలు అధికారం చేపట్టాక వారిని గాలికొదిలేశాయి. పైపెచ్చు 1/70 సహా ఆదివాసీ చట్టాలను సవరించాల్సి ఉందన్న స్పీకర్ అయ్యన్నపాత్రుని వ్యాఖ్యలతో టిడిపి కూటమి సర్కార్ అసలురంగు బట్టబయలైంది. మన్యంలోని సహజ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చూస్తున్న కేంద్రం చర్యలకు చంద్రబాబు ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. జిఒ నెంబర్ 3 పునరుద్ధరణ, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి వంటి హామీలను సైతం నెరవేర్చకపోవడంతో కూటమి పాలనపై అంతటా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఇటీవల మెగా డిఎస్‌సిని ప్రకటించిన ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతంలో వారికి అందులో తీవ్ర అన్యాయం చేసింది. గిరిజనులకు ఉద్యోగాల్లో శత శాతం రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించకుండా మెగా డిఎస్‌సి ప్రకటించడం ఆదివాసీలకు ద్రోహం చేయడమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చిన ఎన్నికల హామీని విస్మరించి ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టబద్దం చేయకుండా మెగా డిఎస్‌సి ప్రకటించడం వల్ల షెడ్యూల్ ప్రాంతాల్లోని పోస్టులు గిరిజన అభ్యర్థులకు దక్కని పరిస్థితి నెలకొంది. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కేవలం 45 పోస్టులే ఆదివాసీలకు దక్కుతున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఇప్పటికే మన్యం రగులుతోంది. నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీలు బంద్, జీపుజాతా నిర్వహించారు. స్పెషల్ డిఎస్‌సిపై కూటమి ప్రభుత్వం నుంచి బుజ్జగింపులు, హామీలు, ప్రకటనలే తప్ప గిరిజనులకు ఎటువంటి భరోసా లభించలేదు. మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులను మినహాయించాలని ఆదివాసీలంతా కోరుతున్నారు. ఏజెన్సీలో గంజాయి మాఫియాను అరికట్టడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా సుమారు 400 మంది గిరిజనులు జైళ్లలో మగ్గుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపి ఉంటే అమాయక ఆదివాసీలు గంజాయి సాగు వైపు వెళ్లి ఉండేవారు కాదని పలువురు చెబుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటి అరా మినహా ఏవీ అమలు కాకపోవడంతో ఆదివాసీలు పెదవి విరుస్తున్నారు. ఇంటింటికీ రేషన్ సరకులు ఉద్దేశించిన ఎండియు వ్యవస్థను కూటమి సర్కార్ నిలిపివేయడంతో ఆదివాసీల కష్టాలు మళ్లీ మొదటికే వచ్చాయి. వందలాది గ్రామాల గిరిజనులకు డిఆర్ డిపోలు సమీప ప్రాంతాల్లో లేవు. ఐదారు కిలోమీటర్లు నడిచి వెళ్లి రేషన్ మోసుకుని తెచ్చుకునే పరిస్థితి వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా తమ ఆర్థిక బకాయిలు చెల్లింపుల్లో ప్రభుత్వం తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన బాట పడుతున్నారు.


దీక్షకు మద్దతు ఇస్తున్న ఎఫ్ఎస్ఒ తిమ్మసాయి తదితరులు

21వ రోజుకు ఆదివాసీ జెఎసి రిలే దీక్షలు

ప్రజాశక్తి - చింతూరు : ఆదివాసి జెఎసి నిరాహార దీక్షలు బుధవారం నాటికి 21 రోజులకు చేరింది. ఐటిడిఎ కార్యాలయం ముందు దీక్షా శిబిరం కొనసాగుతోంది. బుధవారం దీక్షా శిబిరానికి ఎఫ్ఎస్ఓ తిమ్మసాయి మద్దతు తెలిపి పూలదండలు వేసి దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెఎసి రాష్ట్ర కార్యదర్శి చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, చూటూరు గ్రామస్తులు, యువత, కూనవరం మండల మాజీ ఎంపిపి కరకలక్ష్మి , కరకగూడెం గ్రామస్తులు మద్దతు తెలిపారు.



బెడ్‌షీట్లు, కవర్లు అందిస్తున్న జమాల్‌ఖాన్

రోగులకు బెడ్‌షీట్లు, దిండు కవర్లు అందజేత

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ఆరోగ్య సామాజిక కేంద్రంలో బుధవారం జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగుల బెడ్‌లకు 100 బెడ్‌షీట్లు కవర్లు, 100 పిల్లో కవర్లను ట్రస్ట్‌చైర్మన్ జమాల్‌ఖాన్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డికి అందజేశారు. రోగులకు బెడ్‌షీట్లు, పిల్లోకవర్స్ అందుబాటులో లేవని గతంలో కోటిరెడ్డి విన్నవించగా జమాల్‌ఖాన్ సానుకూలంగా స్పందించి బెడ్‌షీట్ కవర్లు, పిల్లోకవర్లు తమ ట్రస్ట్ లోగోతో చేయించి అందజేశారు. గతంలో ఆసుపత్రి ఆవరణలో ట్రస్ట్ ద్వారా లక్షా 50 వేల వ్యయంతో బోరును అడిగిన వెంటనే వేయించడం జరిగింది. అడిగిన వెంటనే స్పందించి అవసరమైన సామగ్రి అందించినందుకు సూపరింటెండెంట్ కోటిరెడ్డి ఆసుపత్రి సిబ్బంది జమాల్‌ఖాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి స్టాఫ్‌నర్స్, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎండి జావేద్, ఎస్.కె.రసూల్, మండల నాయకులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటి సభ్యులు పి.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిఎస్‌సిపై టిఏసిలో తీర్మానం చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖా మంత్రికి డిఎస్‌సి సాధన కమిటీ లేఖ

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2025 మెగా డీఎస్సీ నుండి 5వ షెడ్యూల్ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించాలని, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ద్వారా స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసేందుకు టీఏసిలో తీర్మానం చేయించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి డీఎస్సీ సాధన కమిటీ బహిరంగ లేఖను రాసి ప్రకటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్సీ సాధన కమిటీ నాయకులు అప్పలనర్స, ఆర్ జగన్మోహన్‌రావు, చీకటి నాగేశ్వరరావు, కూడా రాధాకృష్ణ, వంతల నాగేశ్వరరావు, జి భానుచంద్రరావు వంతల దాస్ మాట్లాడుతూ, ఆదివాసీలకు 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్లను చట్టబద్ధత చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, మొత్తం 5వ షెడ్యూల్డ్ ఏరియా (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి) లో 2025 ఏప్రిల్ 20న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సీలో పరిమిత పోస్టులు కేటాయించడం వల్ల గిరిజన యువత, ఉపాధ్యాయులలో అశాంతిని కలిగిస్తోందన్నారు. ఐదవ షెడ్యూల్లోని గిరిజన ప్రయోజనాలకు ప్రాధాన్యత నిస్తూ షెడ్యూల్డ్ ప్రాంతాలలో చట్టాల అమలును నిర్దేశించడానికి గవర్నర్కు పూర్తి విచక్షణాధికారం కల్పిస్తుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆదివాసీలకు 100శాతం రిజర్వేషన్లు అమలు, ఇది గిరిజన సంస్కృతి, ఆచారాలు, ప్రయోజనాలను కాపాడుతుందన్నారు.జి.ఓ నెం. 3 స్థానంలో ప్రత్యామ్నాయ జి.ఓ ద్వారా 100శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, ఇందుకు సత్వర చర్యల కోసం తాము ఎదురు చూస్తున్నామని ఈ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.


లేఖను చూపుతున్న డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు


రికార్డులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి

-డిఎం అండ్ హెచ్ఒ జమాల్ బాషా

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను ఆయన పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారి సౌజన్య తో మాట్లాడిన ఆయన ప్రతిరోజూ ఓపీ సంఖ్యపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ నేపథ్యంలో ప్రజల్లో ఎక్కువగా కనిపించే మలేరియా, టైఫాయిడ్, టి.బి వంటి వ్యాధుల నిర్ధారణ కోసం అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని సూచించారు.ప్రతి పంచాయతీ గ్రామంలో కఫం నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. కోట్నాపల్లి పంచాయతీ పెదగరువు గ్రామాల్లో గర్భిణీతో మాట్లాడి, ప్రతి నెల హెల్త్ చెక్-అప్స్ చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం, ఆకుకూరలు, పాలు, గుడ్లు, చెక్కిళ్లు వంటి వాటిని తినడంతో తల్లీశిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. చిన్నపిల్లలకు టీకాల వేసే కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలించారు.



గాలింపు చర్యలు చేపడుతున్న ఎన్‌డిఆర్ఎఫ్ దళాలు, పోలీసులు

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

దేవీపట్నం - ప్రజాశక్తి : మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయ సమీపంలో గోదావరి నదిలో గల్లంతైన మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. బుధవారం పోలీసులు, ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలతో కలిసి గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. స్నానాలు చేసే రేవు సమీపంలోనే మృతదేహం ఉందని చెప్పారు. మంగళవారం కాకినాడ సర్పవరం నుండి 11 మంది యువకులు గండి పోచమ్మతల్లి అమ్మవారి దర్శనానికి వచ్చారని తెలిపారు. వీరంతా గోదావరి నదిలో స్నానానికి దిగగా, అందులో రాజు ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడని తెలిపారు. మంగళవారం గాలించినా ఆచూకీ లేదని, సిఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్, తహశీల్దార్ నారాయణ బుధవారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించామని, వారి బంధువులకి సమాచారం ఇచ్చామని అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

వెలుగు సిసిలపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సొవ్వ క్లస్టర్ గసభ పంచాయతీ సొవ్వ పంచాయతీ పరిధిలో వెలుగు సీసీలపై సమగ్ర విచారణ జరిపించాలని గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డు సభ్యుడు పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, మూడు నెలల క్రితం అరకు క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్, ఏపిఎం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సభ్యులు సమక్షంలో విచారణ జరిగిందన్నారు. విచారణ జరిగి నేటికీ మూడు నెలలు గడిచినా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి సిసిలపై కఠిన చర్యలు తీసుకోకుంటే డ్వాక్రా మహిళలు, ప్రజలు కలిసి వెలుగు కార్యాలయాన్ని ముట్టడిస్తామనీ హెచ్చరించారు.


తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపినా, చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి ఎస్సై ఎం.వెంకటరమణ హెచ్చరించారు. సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు, సీఐ ఎం. వినోద్ బాబు పర్యవేక్షణలో బుధవారం జరిగిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి హనుమాన్ జంక్షన్ కూడలి వరకు ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. సంతబయలు, పాత బస్టాండు కూడలి, రంగ సెంటర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద రహదారిపై వాహనాలు పార్క్ చేయడం, వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. రహదారులపై వాహనాలు నిలిపితే, దానికి సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు సహకరిస్తే మాత్రమే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన రాకాసమ్మ దేవి జాతర

ప్రజాశక్తి-చింతపల్లి: పర్యాటక ప్రాంతంగా విశేష గుర్తింపు పొందిన లంబసింగి ప్రాంత గ్రామదేవత రాకాసమ్మ దేవి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. జాతర సందర్భంగా గ్రామ మంతటా విద్యుత్ అలంకరణలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తూ, ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తి చేసుకోవడంపై ప్రజలందరికీ ఉత్సవ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


పండుగలో ప్రజల సందడి

ప్రతి రోజూ యోగా చేయాలి

- గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5 వేల మందితో గిరిజన యోగా
- హాజరైన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు


గంగవరంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది


యోగాసనాలు వేస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజాశక్తి - గంగవరం : ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ, ప్రతి రోజూ యోగా చేయాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సుమారు 5,100 మంది గిరిజనులతో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, డిఎఫ్ఒ రవీంద్రధామ, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్ యోగా శిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 200 మంది యోగా ట్రైనర్ల ద్వారా సుమారు 3వేల మంది యోగా శిక్షణ అందించామని, వారి ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో 50 మందికి ప్రత్యేకంగా యోగ శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగాకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రుక్మాంగదయ్య, వెలుగు ఎపిడి డేగలయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, రామకృష్ణ, బాలాజీ, డిప్యూటీ తహశీల్దార్ స్వామి, ఎంపిడిఒలు లక్ష్మణ్, శ్రీనివాసరావు దొర, విశ్వనాథ్, గిరిజన సంక్షేమ శాఖాధికారులు రామతులసి, కృష్ణమోహన్, సిడిపిఒలు సంధ్యారాణి, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

సీలేరు: యోగాతో శారీరక ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా పెంపొందించుకోవచ్చని సిఆర్‌పి 42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.కృష్ణ పేర్కొన్నారు. జికెవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం యోగాంధ్ర శిక్షణ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి సృజన, సిఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ అశోక్, జికె వీధి సిఐ వరప్రసాద్, ఎస్ఐ రవీంద్ర, హెచ్ఎస్ త్రినాథ, సిఆర్‌పిఎఫ్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు పునరావృతమైతే కఠినచర్యలు

అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శిరీష
'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలో మాతా శిశు మరణాలు పునరావృతం అయితే చర్యలు తప్పవని రంపచోడవరం అడిషనల్ డిఎం హెచ్ఒ శిరీష అన్నారు. ఈ నెల 4న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'శిశు మరణాలు' అనే వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి జమాల్‌భాషా ఆదేశాల మేరకు రంపచోడవరం అడిషనల్ డిఎం హెచ్ఒ శిరీష విచారణ చేపట్టారు. లాగరాయి పిహెచ్‌సి పరిధి మొల్లిమెట్లలో శిశువు మృతిపై తల్లి ఎల్లం శిరీష, తండ్రి రామిరెడ్డిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 10న జన్మించిన ఈ శిశువు అనారోగ్యంతో మార్గ మధ్యలో మృతి చెందడంపై ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడి వర్కర్ల నుంచి సమగ్ర నివేదికను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. అనంతరం పిహెచ్‌సి తనిఖీ చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎందుకు అందుబాటులో ఉంచలేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు వినియోగించే విధంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆక్సిజన్ సిలిండర్లపై ఆరా తీశారు. డాక్టర్ నాగార్జున, యంపిహెచ్ఒ ప్రసాదరావు, సిహెచ్ఒ దైవకృపాచార్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు ఝూన్సీరాణి, సుధాకర్, మణిదీప్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. రాజవొమ్మంగి పిహెచ్‌సిని తనిఖీ చేశారు. అనంతరం జడ్డంగి పిహెచ్‌సిలో వాతంగి గ్రామానికి చెందిన సంపంగి రాఘవ రెండో కాన్పుగా జన్మనిచ్చిన మూడునెలల ఆడశిశువు మృతికి శ్వాససమస్య కారణమని శిరీష అన్నారు. ప్రసవానికి ముందు, తరువాత సేవలపై వివరాలు తీసుకున్నారు. వార్డులో చిరిగి ఉన్న బెడ్స్,ఆపరేషన్ థియేటర్, మందుల గదిని పరిశీలించారు. పిహెచ్‌సి ఆవరణలో అసంపూర్తి ప్రహరీ, లొదొడ్డి సబ్‌సెంటర్‌లో మందుల కొరత వంటి సమస్యలను డాక్టర్ నాగార్జున ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్ట్ వైద్యసిబ్బందికి మూడు నెలలుగా జీతాలు లేవని సత్యవేణి, కె.పాప, దుర్గ వినతిపత్రం అందించారు.


శిశువుల మృతికి కారణాలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ శిరీష


దీక్ష విరమింపచేస్తున్న గుండాల సచివాలయం సెక్రటరీ నాగేశ్వరావు

అధికారుల హామీతో రిలే దీక్షల విరమణ

ప్రజాశక్తి - ఎటపాక: రోడ్ల నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షతో అధికార యంత్రాంగం ఎట్టకేలకు దిగివచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వటంతో ఏడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు విరమించారు. మండల అధికారుల ఆదేశాలతో గుండాల సచివాలయం సెక్రటరీ నాగేశ్వరావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే మరో విడత పోరాటానికి సిపిఎం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు ఇర్పా సత్యం, ఇరపా అజయ్, జి.హరి, గ్రామస్తులు తోట శ్రీను, బండారు స్టాలిన్, నూతలపాటి సుధాకర్, పూనెం చలపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దుకాణాలు నివాసాలు కోల్పోయిన బాధితులకు రంపచోడవరం మాజీ సర్పంచ్ వై నిరంజనీదేవి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు మాజీ సర్పంచ్ నిరంజనీదేవి రోడ్డు విస్తరణ పనుల్లో సర్వం కోల్పోయిన బాధితులకు బియ్యం, కూరగాయలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై చిరు వ్యాపారులు, దుకాణాలు పూర్తిగా నేలమట్టం కావడంతో స్థానికంగా ఉన్న ప్రజలు నిత్యవసర సరుకులు దొరక్క తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. వారికి సాయపడదామనే ఉద్దేశంతో సరుకులు పంపిణీ చేశానని ఆమె తెలిపారు.


సరుకులు పంపిణీ చేస్తున్న నిరంజనీదేవి



పూర్తయిన రహదారి

రహదారి పనులు పూర్తి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని దుర్గం పంచాయతీ పరిధిలోని దుర్గం పాలమామిడి నుంచి గొడ్డుమామిడి పాలమెట్ట వరకు రూ.4 కోట్ల వ్యయంతో కొత్త తారు రోడ్డు నిర్మాణ పనులు గత వారం రోజులుగా చేపడుతున్నారు. ఈ పనులు బుధవారం పూర్తయ్యాయి. దాదాపు 3 కిలోమీటర్ల పొడవున ఈ తారు రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ ప్రాంతంలో గతంలో తారు రోడ్డు లేక మట్టి రోడ్ల ద్వారానే రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లె బాటలో భాగంగా, టీడీపీ అరకు ఇన్చార్జి దొన్ను దొర ఆధ్వర్యంలో ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి తో సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పథకాల పేరుతో ఐటిడిఏ, సీసీడీపీ, కాఫీ, ఎన్ఆర్ఈజీపీ నిధులు వేరే దారికి మళ్లించిందన్నారు.కూటమి ప్రభుత్వం ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి కట్టుబడి పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాల మేరకు తగిన విస్తీర్ణంలో పనులు చేపట్టినట్లు తెలిపారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి హుకుంపేట : మండలంలోని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో బుధవారం మిడ్డే మీల్స్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కోడా ఈశ్వరరావు, జిల్లా మిడ్ డే మీల్స్ సెక్షన్ అధికారులు రాంబాబు, శివశంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,"వంట రుచిగా ఉండేలా చేయాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ జాన్ బాబు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి -పాడేరు, : పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఈనెల 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకేరోజు 3.45 లక్షల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమం వనం-మనం కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ థీమ్ "ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి"కి అనుగుణంగా, చర్యలు తీసుకోవాలని డివిజనల్ అటవీ అధికారి సందీప్ రెడ్డిని ఆదేశించారు. వనం మనం కార్యక్రమాన్ని అరకు మండలం జయపూర్ రోడ్ లో గల అరకు పైనరీ వద్ద గురువారం ఉదయం 11.00 గంటలకు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో ఐటిడిఎ, ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు, అటవీ, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల పేరిట మోసం

' వెన్నుపోటు దినం' నిరసనలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు:బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు దుయ్యబట్టారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన "వెన్నుపోటు దినం కార్యక్రమం లో భాగంగా బుధవారం పాడేరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వైసిపి క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డీఆర్వో పద్మలతకి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు బిమాట్లాడుతూ, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు పేరుతో హామీలు ఇచ్చి ప్రజలకు మొండి చెయ్యి చూపించారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఎన్నడు లేని విధంగా గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈ కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో జి మాడుగుల మండల జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకట లక్ష్మీ, చింతపల్లి జడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య, చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుసా దేవి, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, వైయస్సార్ నాయకులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై సంబరాలు



అరకులోయలో పాల్గొన్న దొన్నుదొర, నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ:రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన అరకుయలోని గిరిజన సంస్కృతిక మ్యూజియం ఆవరణలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొన్నుదొర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పం అన్నారు.సూపర్ సిక్స్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టిలి దాసుబాబు, టిడిపి మండల అధ్యక్షుడు లోకోయ్ మహాదేవ్, నాగరాజు జనసేన ఇన్చార్జి చిరంజీవి, కూటమి నాయకులు చందు నిర్మల, లక్ష్మి,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కడశిల్ప గ్రామంలో మఠం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపరిపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ, బడుగు, బలహీన, పీడిత వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు 85 శాతం అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, మండల కోఆర్డినేటర్ వంతల రాజుబాబు, సీనియర్ నాయకులు చల్లంగి రవి, కొర్ర క్రిష్ణ, కారెగి మత్స్యరాజు, పాంగి సుబ్బారావు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : కూటమి ప్రభుత్వం పాలన ముగిసి ఏడాది ఐన సందర్భంగా డిప్యూటీ సీఎం, జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ 4వ తేదీన పండగలా నిర్వహించాలని ఆదేశించడంతో స్థానిక టిడిపి నాయకులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ములకల సాయికృష్ణ తెలిపారు. వి.ఆర్.పురం మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. జనసేన మండల కార్యదర్శి బాగుల అంజనరావు. బి. గణేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



రోదిస్తున్న బంధువులు

ప్రాణం తీసిన ఈత సరదా

- నదిలో మునిగి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో జానకిరాంపురం శివారు వరహానది వద్ద ఈత సరదా ఇద్దరూ అన్నదమ్ములను బలి తీసుకుంది. వివరాల్లోకి వెళితే వేసవి సెలవులు కావడంతో వరాహనది సమీపంలో జానకిరాంపురం గ్రామంలో నలుగురు విద్యార్థులు ఈత కొట్టేందుకు బుధవారం నదిలోకి దిగారు. అందులో ఇద్దరు సుర్ల దేవ(15) సుర్ల హేమంత్(13) నీటిలో మునిగి మృతి చెందారు. దేవ 9, హేమంత్ ఏడవ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ అన్న దమ్ములు కావడంతో కుటుంబంతో పాటు గ్రామంలో కూడా విషాద ఛాయలు అలముకున్నాయి, అప్పటి వరకు ఆడుతూ పాడుతూ తిరిగిన బాలురు ఒక్కసారిగా విగత జీవులుగా మారడంతో ఘటన చూసిన ప్రతి ఒకరిని కలిచివేసింది. ఈ ఘటన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రమేష్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కారులో మంటలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయరహదారిలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల వద్ద బుధవారం కారులో నుంచి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించి కారులో ప్రయాణిస్తున్న వారు హుటాహుటిన దిగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం... విజయనగరానికి చెందిన ఆల్తి రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి విజయనగరం నుంచి నగరంలోకి ఫోర్డ్ ఫిగో కారులో వస్తున్నారు. జూ పార్కు వద్దకు వచ్చే సరికి కారు ఒక్కసారిగా నెమ్మదించింది. కారును పక్కకు తీసి ఆపేసారు. ఒక్కసారిగా కారు ఇంజన్ నుంచి పొగతో కూడిన మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు హుటాహుటిన దిగిపోయారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధి పందలపాక ఐటిబిపి సమీపంలో బుధవారం భారత జనఔషధీ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ కేంద్రం ద్వారా ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాలను అందించడమే లక్ష్యం అన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి కార్పొరేట్ మందుల దుకాణాల ఖర్చుతో పోలిస్తే, సుమారు 80 శాతం వరకు తక్కువ ధరల్లో అవసరమైన ఔషధాలు లభించనున్నాయని చెప్పారు. సుమారు 2,000 రకాల ఔషధాలు, ముఖ్యంగా బీపీ, సుగర్, వాత, కఫ సంబంధిత సమస్యలకు మందులు ఈ కేంద్రంలో లభ్యమవుతాయన్నారు. నిర్వాహకులు లక్ష్మీశ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐటిబిపి డిఐజి పికె.జైస్వాల్, కమాండెంట్ హరిసింగ్, స్థానిక నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, కాకర్లపూడి శ్రీకాంత్, తాట్రాజ్ అప్పారావు, బిఆర్‌బి నాయుడు, బమ్మిడి ఉమా, బర్రెడ్డి మల్లికార్జున రావు, కాకర రమణ, పోతిన గోవిందరావు, కర్రోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి - సీలేరు: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సిపిఎం గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు పేర్కొన్నారు. జికె వీధి మండలం సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికొండ పంచాయతీ పరిధి మారుమూల గ్రామాల్లో గిరిజనులకు ఎటువంటి అనారోగ్యం వచ్చినా వెంటనే ఆశా కార్యకర్తలు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు తక్షణమే అందించాలన్నారు. ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి ఎవరైనా వ్యాధులు బారినపడ్డారా లేదా అనే అంశాలపై క్లుప్తంగా పరిశీలించా లన్నారు. వ్యాధుల బారిన పడిన రోగులకు సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యశాల అందించాలని కోరారు. పంచాయతీ పరిధి మారుమూల కావడంతో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. వైద్యాధికారి, సిబ్బంది విధులు పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏ.దారకొండ వైస్ సర్పంచ్ చంటిబాబు రామారావు, చిట్టిబాబు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

ప్రజాశక్తి - రంపచోడవరం : వరుస మోటార్‌సైకిల్స్ చోరీల విషయంలో సిఐ రవికుమార్, ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో గస్తీలు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. రంపచోడవరం మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. వారి వద్ద నుండి 6 బైకులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు, నలుగురు చిన్నపిల్లలు (మైనర్స్)ను జువెనైల్ హోమ్‌కు పంపారు.

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని జడ్డంగి పోలీసులు బుధవారం సీజ్ చేశారు. జడ్డంగి ఎస్ఐ చినబాబుకు అందిన సమాచారం మేరకు జడ్డంగి చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా అడ్డతీగల గ్రామానికి చెందిన నేకురి కళ్యాణ్ అనేవ్యక్తి తన వాహనంలో 5 ఆవులను అక్రమంగా తరలిస్తున్నాడు. ఎస్ఐ చినబాబు వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా ఎస్‌పి బాలు జయంతి



ఎస్‌పి బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: దివంగత ఎస్‌పి జయంతి సందర్భంగా దొండపర్తి విశాఖపట్నం బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలబాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ బాలు అసోసియేషన్ అధ్యక్షుడు శర్మ ఆర్టికల్స్ అద్దంకి వాసు, మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకుని విశాఖపట్నం కళాకారులు అందరి తరపున బీచ్ రోడ్‌లో ఎస్పీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.కార్యక్రమంలో కబడ్డీ శ్రీను, సిబిఐ ఆనంద్, ఇంటీరియల్ మధు, బిల్డర్ రవికాంత్, జివి రమణ పాల్గొన్నారు.

డిఎస్‌సి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

అధికారులతో సమీక్షలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్అశోక్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించనున్న డిఎస్‌సి పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, పక్కా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్షల జరగనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డిఎస్‌సి షెడ్యూల్ ఉంటుందని, సుమారు 57,895 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలో కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కాలేజ్, పెదగంట్యాడ ఎస్‌విఎస్ సొల్యూషన్స్, షీలానగర్, చినముషిడివాడ-1,2 ఐయాన్ డిజిటల్ సెంటర్లు, ఎన్ఎస్‌టిఎల్ సమీపంలోని ఎడిజెడ్ ఆర్వోనా డిజిటల్, మధురవాడ, రుషికొండ గాయత్రివిద్యాపరిషత్, దువ్వాడ విజ్ఞాన్, కాపు జగ్గరాజుపేట విజ్ఞాన్, శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి, నర్వా విట్స్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకూ రెండు పూటలా పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరు కావాలని, హాల్ టిక్కెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపుకార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్ఎ. పిఒ చంద్రశేఖర్, డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆర్టిసి, విద్యుత్, పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

యువ దర్శకులు విజయవంతం కావాలి

ప్రొడక్షన్ నెంబర్ 3 పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యువదర్శకులు విజయవంతం కావాలని సినీ నిర్మాత, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారధ్యంలో ఆర్‌కె మీడియాహౌస్ సహ సమర్పణలో వైజాగ్‌కి చెందిన యువదర్శకుడు రత్నం రామ్‌గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నెంబర్ 3 చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నూతన ఒరవడిలో చిత్రాన్ని నిర్మించి ఎంతోమంది యువదర్శకులు విజయవంతం అయ్యారని అదేకోవలో ఈ చిత్రం కూడా భారీ విజయవంతం అవుతుందని ఆశిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సినిమాబృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌కె మీడియాహౌస్ అధినేత బి.రవికాంత్, సీనియర్ జర్నలిస్ట్ లఖినేని బాలకృష్ణ, కవి,రచయిత సత్తివాడ శ్రీకాంత్, సహాయ దర్శకుడు నాని రిషి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోర్టు వెంకన్న కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై వెలసిన వెంకటేశ్వరస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఈ నెల 6 నుండి 12 వరకూ వేడుకలు ఉంటాయన్నారు. కల్యాణం 7వ తేదీ సాయంత్రం 7 గంటలకు జరుగుతుందని, 8న సాయంత్రం 6 గంటలకు స్వామివారి తిరువీధి సేవ, 9 న సాయంత్రం 5 గంటలకు పండితగోష్ఠి మహదాశీర్వచనం ఉంటుందన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్వామివారి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 11న ఉదయం 8 గంటలకు సముద్ర స్నానం, అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల కు చోరోత్సవం, 12 న సాయంత్రం 6 గంటలకు పుష్పాంజలి ఉంటుందన్నారు. 22 వ తేదీన 16 రోజుల పండుగ పాలికా విసర్జనంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఉత్సవాలను ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు.

గిరిజన కుటుంబానికి సిటీ పోలీస్ శాఖ సాయం



సరుకులు అందజేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అల్లూరి సీతారామరాజు జిల్లా, పెద బయలు మండలం సీత గుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన వెచ్చంగి కమలమ్మ, వెచ్చంగి విజయ రాజు కుటుంబానికి విశాఖ పట్నం సిటిపోలీసులు సహాయాన్ని అందించారని అఖిలభారత గిరిజన ఉద్యోగ సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎంవిపి కాలనీ గిరిజన్‌భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నెలరోజుల కిందట వెచ్చంగి కమలమ్మకు, ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. శిశువులు బరువు తక్కువగా ఉండడంతో పాటు తల్లి కూడా అనారోగ్యంతో ఉందన్నారు. వారి ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో సిటి పోలీస్‌శాఖ స్పందించి వారి కుటుంబానికి రెండు నెలలకు సరిపోయే సరుకులు అందజేశారని వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సి.ఐ దాలిబాబు, సిసా శోభన్, జి.రాము పాల్గొన్నారు.



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి గోవిందరాజులు

గ్రంథాలయ శిక్షణా తరగతుల్లో పోటీలు

ప్రజాశక్తి - విఆర్ పురం: కూనవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం స్వర్ణాంధ్ర - 2047 అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-1 సురేష్ , వెల్ఫేర్ అసిస్టెంట్ తుష్టి సాయిలక్ష్మి , విజయ సాధన హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, పాఠకులు చెరుకూరు సుబ్బారావు, నోముల సత్యనారాయణ, నీలకంఠేశ్వరరావు హాజరయ్యారు. లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి : 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో చిడుమూరు- కుంట గ్రామాల మధ్య బుధవారం కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 9 మందిపై కేసు నమోదు చేశారు. మూడు కత్తులు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

హామీల అమలుపై చర్చకు సిద్ధమా ?

- వైసిపికి భీమిలి ఎమ్మెల్యే గంటా సవాల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మేనిఫెస్టో హామీల అమలుపై జర్నలిస్టుల సమక్షంలో చర్చకు సిద్ధమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైసీపీకి సవాల్ విసిరారు. ఎంవిపి కాలనీలోని ఆయన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని జగన్‌మోహన్‌రెడ్డి తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో చెప్పిన అనేక హామీలు అమలు చేయకుండా ఐదేళ్లు గడిపేశారన్నారు. తల్లి, చెల్లి పట్ల వ్యవహరిస్తున్న తీరుతోనే జగన్ నైతిక విలువలేంటో ప్రజలకు తెలిసిందన్నారు. 6 శాతం సీట్లు తెచ్చుకున్న వైసీపీకి ప్రతిపక్షహోదా రాదని, ఇవ్వలేదని ఏడాదిగా జగన్ అసెంబ్లీకి రాలేదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి గంగా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్స్ ఫ్యాషన్ కొత్త కలెక్షన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ మాక్స్ ఫ్యాషన్ నుండి నూతన వస్త్రశ్రేణి డిస్నీలిలో అండ్ స్టిచ్ పేరుతో నూతన కలెక్షన్ వస్త్రాలను బుధవారం విశాఖపట్నం సిరిపురం విఐపి రోడ్‌లో ఉన్న మ్యాక్స్ షోరూంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యాక్స్ ఫ్యాషన్ డిప్యూటీ సిఇఒ సుమిత్ చందన మాట్లాడుతూ ఈ నూతన కలెక్షన్‌ను పిల్లలు, యువత కోసం ప్రత్యేకంగా రూపొందించామని వినియోగదారులను ఆకర్షిస్తాయన్నారు. కార్యక్రమంలో డిస్నీ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఇండియా డైరెక్టర్ ప్రియా నిజారా పాల్గొన్నారు.